నేడు హైదరాబాద్‌లో ఐదుచోట్ల మాక్‌డ్రిల్

- సాయంత్రం 4 గంటల నుంచి 4.30 వరకు
- ప్రజలు సహకరించాలి..భయాందోళనలకు గురికావొద్దు
- నోడల్ అధికారిగా నాగిరెడ్డి : అర్విందక్‌కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర హోం శాఖ ఇచ్చిన ఆదేశాల మేరకు హైదరాబాద్‌లో సైతం బుధవారం మాక్‌డ్రిల్(సివిల్ అభియాన్)ను నిర్వహించడానికి రాష్ట్ర ప్రభుత్వం పూర్తి ఏర్పాట్లు చేసిందనీ, మొత్తం ఐదు చోట్ల నిర్వహించనున్నామని సీనియర్ ఐపీఎస్ అధికారి అర్విందక్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అత్యంత ప్రాధాన్యత గల జాబితాలో ఉన్న హైదరాబాద్‌లోని సికింద్రాబాద్, గోల్కొండ, కంటోన్మెంట్, కంచన్‌బాగ్, నాచారంలలో ఈ మాక్‌డ్రిల్ సాగుతుందని పేర్కొన్నారు. దీనికి సివిల్ డిఫెన్స్ డైరెక్టర్, రాష్ట్ర అగ్నిమాపక శాఖ డైరెక్టర్ జనరల్ వై.నాగిరెడ్డి పర్యవేక్షణాధికారిగా ఉంటారని తెలిపారు. పోలీసు, ఫైర్ సర్వీస్, ఎన్డీఆర్ఎఫ్, డీఎమ్, ఈ మాక్‌డ్రిల్‌లను నిర్వహిస్తాయని పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటల నుంచి 4:30 వరకు ఈ డ్రిల్ సాగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రజలెవ్వరూ భయభ్రాంతులకు గురికావొద్దనీ, మాక్‌డ్రిల్‌కు సహకరించాలని కోరారు. పెహల్గాంలో ఉగ్రవాద మూకల ఘటన తర్వాత భారత్, పాక్ మధ్య ఉద్రిక్త పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. ఉగ్రవాదుల సెల్టర్ జోన్‌గా మారిన పాకిస్తాన్‌పై ఇప్పటికే సింధూజలాల నిలిపివేత మొదలుకుని పలు ఆంక్షలను కేంద్ర ప్రభుత్వం విధించిన విషయం విదితమే. రెండు దేశాల మధ్య యుద్ధం సంభవిస్తే అందుకు తగిన విధంగా ప్రజలను కూడా సన్నద్ధం చేసే ప్రక్రియకు కేంద్రం పూనుకున్నది. 1971లో పాక్‌తో యుద్ధం జరిగిన సమయంలో సివిల్ డిఫెన్స్ విభాగాలను అన్ని రాష్ట్రాల్లోనూ ఏర్పాటు చేసి ఎయిర్‌రైడింగ్ జరిపి ప్రజలు తమను తాము కాపాడుకునేలా కేంద్రం మాక్‌డ్రిల్ చేపట్టింది. ఇన్నేండ్ల తర్వాత మళ్లీ మాక్‌డ్రిల్ ప్రయోగాన్ని చేపట్టనున్నది. బుధవారం సాయంత్రం 4 గంటలకు యుద్ధ సమయంలోనే మాదిరిగానే సైరన్ మోగించి మాక్ డ్రిల్ చేపడుతారు.

మాక్‌డ్రిల్ కార్యక్రమాలు..ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

1. ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఇండస్ట్రియల్ సైరన్లు, పోలీసు మైకులు(చౌరస్తాల వద్ద) సరిగ్గా 4 గంటలకు వినిపిస్తారు.
2, నగరంలో ఒకేసారి రెండు నిమిషాల పాటు పోలీస్, ఫైర్, మెడికల్ సైరన్లు మోగుతాయి.
3. సైరన్ విన్న వెంటనే వేగంగా, శాంతంగా స్పందించాలి
4. తక్షణం ఆశ్రయం పొందడం కోసం బహిరంగ ప్రదేశాల నుంచి తప్పించుకుని షెల్టర్‌లోకి వెళ్లాలి.
5. పుకార్లను పట్టించుకోకుండా అధికారుల సూచనలను మాత్రమే అనుసరించాలి
6. ఇండ్లలో గ్యాస్, ఎలక్ట్రికల్ పరికరాలు ఆఫ్ చేయాలి.
7. ప్రమాదం తీరినట్టు అధికారులు ప్రకటించే దాకా ఆశ్రయంలోనే ఉండాలి.
8. దగ్గర్లో ఆశ్రయం లేకపోతే తక్కువ ప్రదేశంలో నక్కి తలను కప్పుకోవాలి. తగినరీతిలో రక్షణ పొందేందుకు ప్రయత్నించాలి.

ఆర్‌టిసి సమ్మె వాయిదా

- జెఎసి నేతలతో మంత్రి పొన్నం చర్చలు
- సమస్యలు పరిష్కరిస్తామని హామీ
- చర్చలు సఫలం-జెఎసి ప్రతినిధులు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి ఈనెల 7 నుంచి తలపెట్టిన సమ్మె పలు నాటకీయ పరిణామాల మధ్య వాయిదా పడింది. సమ్మె విరమణ కోసం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మూడు రోజులుగా కార్మిక సంఘాల నాయకులతో వేర్వేరుగా చర్చలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే టిఎంయు ప్రధాన కార్యదర్శి ఇ అశ్వత్థామరెడ్డి నేతృత్వంలోని జెఎసితో సోమవారం మంత్రి చర్చలు జరిపారు. అనంతరం తమ జేఏసీలోని కార్మికులు సమ్మెలో పాల్గొనబోరని అశ్వత్థామరెడ్డి ప్రకటించారు. మంగళవారం ఉదయం టిజిఎస్ ఆర్‌టిసి స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఎస్‌డబ్ల్యూయూ) ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రితో భేటీ తర్వాత సమ్మెపై తమ వైఖరిని తర్వాత ప్రకటిస్తామని పేర్కొంది. అనంతరం సిపిఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం నేతృత్వంలోని మరో జెఎసి ప్రతినిధులు ఈదురు వెంకన్న, ఎమ్ థామస్‌రెడ్డి, కె హన్మంతు ముదిరాజ్‌లు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో సమావేశమయ్యారు. దాదాపు మూడు గంటలపాటు పలు అంశాలపై చర్చించారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి ఉన్నదనీ, ఇప్పటికే పలు డిమాండ్లను పరిష్కరించామంటూ మంత్రి జెఎసి ప్రతినిధులకు వివరించారు. చర్చలు శాంతియుత వాతావరణంలో సామరస్యంగా జరిగాయనీ, తమ డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినందుకు సమ్మెను వాయిదా వేస్తున్నామని అనంతరం జేఏసీ ప్రతినిధులు సచివాలయం వద్ద మీడియాకు తెలిపారు. డిపోల్లో సమస్యలు, ఉద్యోగులు, కార్మికులపై పనిభారం, ఒత్తిళ్లు, కొత్త రిక్రూట్‌మెంట్లు, ఉద్యోగ భద్రత, సింగరేణి తరహా కారుణ్యనియామకాలు, వేతన సవరణ, రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు చెల్లింపు, విద్యుత్ బస్సుల్ని ప్రభుత్వమే కొనుగోలు చేసి ఆర్‌టిసికి ఇవ్వాలనే పలు అంశాలను మంత్రి వద్ద ప్రస్తావించామని నేతలు తెలిపారు. సమ్మె వాయిదా తాత్కాలికమేననీ, ప్రభుత్వం ఇప్పుడు ఇచ్చిన హామీలు అమలు చేయకుంటే, మరోసారి సమ్మె తేదీ ప్రకటిస్తామని హెచ్చరించారు. సమ్మె వాయిదా వేస్తున్నట్టు జెఎసి నేతల ప్రకటనపై మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కార్మిక, ఉద్యోగ పక్షపాతిగా ఉంటుందని తెలిపారు.



జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న మొక్కజొన్న రైతులు

జాతీయ రహదారిని దిగ్బంధించిన మొక్కజొన్న రైతులు

- కంపెనీలు ప్రకటించిన పంట నష్టపరిహారం చెల్లించాలని రాస్తారోకో
- ఆర్గనైజర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు, మొక్కజొన్న కంపెనీలు ప్రకటించిన పంట నష్టపరిహారం డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ములుగు జిల్లా వాజేడు మండలం పూసూరు బ్రిడ్జి వద్ద జాతీయ రహదారిపై వాజేడు, వెంకటాపురం మండలాల మొక్కజొన్న రైతులు సుమారు 500 మంది రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న వెంకటాపురం సిఐ బండారి కుమార్, వాజేడు ఎస్ఐ రాజ్‌కుమార్ వచ్చి రైతులను సముదాయించే ప్రయత్నం చేయగా వినలేదు. దాంతో పై అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేకు సమాచారం అందించగా స్పందించిన భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అధికారులు, రైతు నాయకులతో ఫోన్‌లో మాట్లాడారు. బుధవారం తానే స్వయంగా వచ్చి రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకొని, వ్యవసాయ శాఖ మంత్రికి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో రైతులు రాస్తారోకో విరమించారు. ఈ సందర్భంగా ఆదివాసీ నవనిర్మాణ సేన రాష్ట్ర అధ్యక్షులు కోర్స నరసింహమూర్తి మాట్లాడుతూ.. మూడు నెలలుగా మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు మొక్కజొన్న కంపెనీలు నష్టపరిహారం ప్రకటించిన డబ్బులను, రైతులకు చెల్లించకుండా ఆర్గనైజర్లు, పెట్టుబడుల పేరుతో డబ్బులు తగ్గించి ఇస్తూ మోసాలకు పాల్పడుతున్నారని వాపోయారు. వారికి అధికార, ప్రతిపక్ష పార్టీల మంత్రులు, ఎమ్మెల్యేల అండదండలు ఉండడంతో మొక్కజొన్న పంట నష్ట పరిహారం చెల్లింపులు పూర్తిస్థాయిలో జరగడం లేదని తెలిపారు. రైతులకు జిల్లా కలెక్టర్‌కు మధ్య పంట నష్ట పరిహారం చెల్లింపుల విషయంలో జరిగిన చర్చల్లో ఆర్గనైజర్లు కాలయాపన చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్న విషయం బయట పడిందని అన్నారు. ఆర్గనైజర్లపై సంబంధిత శాఖ మంత్రులు, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకొని మొక్క జొన్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే రైతులందరిని ఏకం చేసి అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ నవనిర్మాణ సేన నాయకులు పాయం రాంబాబు, ప్రవీణ్ పూనం ప్రతాప్, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు జెజ్జరీ దామోదర్ రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ కమ్యూనిస్ట్ సంక్రాంతి మధుసూదన్‌రావు

- పీడిత ప్రజల కోసం జీవితాంతం పోరాటం : బి వెంకట్
- వైరాలో సంస్మరణ సభ
- 11న లాలాపురంలో మధుసూదన్‌రావు స్థూపావిష్కరణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిపిఎం నిర్మాణమే దిక్సూచిగా పీడిత ప్రజల కోసం జీవితాంతం పోరాడిన నిబద్ధత కలిగిన ఆదర్శ కమ్యూనిస్ట్ నేత కామ్రేడ్ సంక్రాంతి మధుసూదన్‌రావు అని వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. ఆయన వేసిన పోరుబాటలో పయనిద్దామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఎం సీనియర్ నాయకులు, కొణిజర్ల మండలం వైరా ప్రాంతం కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత కామ్రేడ్ సంక్రాంతి మధుసూదన్‌రావు సంస్మరణ సభ మంగళవారం బోడేపూడి భవనంలో చింతనిప్పు చలపతిరావు అధ్యక్షతన జరిగింది. మధుసూదన్‌రావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సభలో బి వెంకట్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగం సాయుధ పోరాటంలో అమరుడైన తన బాబాయి సంక్రాంతి రామచంద్రయ్య స్ఫూర్తితో క్రమశిక్షణ కలిగిన కమ్యూనిస్టు నాయకుడిగా మధుసూదన్‌రావు ఎదిగారని వివరించారు. అధ్యయనం - ఆచరణే గీటురాయిగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీని నిర్మించడంలో ప్రముఖ పాత్ర పోషించిన మహనీయులలో మధుసూదన్‌రావు ఒకరని తెలిపారు. ఒక్కడిగానే నిలబడి కొణిజర్ల మండలం, వైరా ప్రాంతంలో సిపిఎంని నిర్మించి నిలబెట్టారని అన్నారు. రాజకీయ దాడులు, కోర్టు కేసులను ధైర్యంగా ఎదుర్కొని పార్టీని నిలబెట్టడానికి, బలోపేతం చేసేందుకు జీవితాంతం కృషి చేసిన మధుసూదన్‌రావు ఆశయాల సాధనకు కృషి చేయడమే నిజమైన నివాళులు అన్నారు. సిపిఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం మాట్లాడుతూ.. బోడేపూడి వెంకటేశ్వరరావు మార్గదర్శకత్వంలో సంక్రాంతి మధుసూదన్‌రావు పయనించి.. వెట్టి చాకిరీ, కుల వివక్షతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటాలకు నాయకత్వం వహించి దళితులు, పేద ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని కొనియాడారు. పార్టీని దెబ్బతీయడం కోసం పాలకవర్గాలు, రాజకీయ పక్షాలు చేసిన కుట్రలను భగ్నం చేస్తూ పేదల పక్షాన నిలబడ్డారని చెప్పారు. మే 11న ఉదయం 9 గంటలకు వైరా మున్సిపాలిటీ పరిధిలోని లాలాపురం గ్రామంలో జరిగే సంక్రాంతి మధుసూదన్‌రావు స్మారక స్థూపం ఆవిష్కరణ, సంస్మరణ సభలో సిపిఎం పొలిట్ బ్యూరో సభ్యులు బివి రాఘవులు, కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, ఎం సాయిబాబు, రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు పాల్గొంటారని తెలిపారు. పార్టీ శ్రేణులు, శ్రేయోభిలాషులు, అభిమానులు పాల్గొనాలని కోరారు.



తల్లిదండ్రులు అనునిత్య గౌరవనీయులు

ప్రజాశక్తి - కల్చరల్

తల్లిదండ్రులు అనునిత్యం గౌరవనీయులేనని ప్రముఖ రచయిత్రి డాక్టర్ ముక్తేవి భారతి అన్నారు భారతీయ సంప్రదాయం తల్లి తండ్రి గురువు దైవంతో సమానమన్నారు. తెలంగాణ స్త్రీ సేవా సంస్థ నిర్వహణలో రాబోయే మదర్స్ డే ను పురస్కరించుకొని ఆంధ్ర మహిళా సభ సౌజన్యంతో ప్రముఖ గాయని రాజ్య లక్ష్మీ, మహిళా సభ ఉపాధ్యక్షులు డాక్టర్ లక్ష్మీ సుందరి, రచయిత్రి డాక్టర్ ముక్తేవి భారతి సత్కరించారు. ప్రముఖ గాయని హైమావతి భీమన్న అధ్యక్షత వహించి మాట్లాడుతూ సత్కారం అందుకున్న వారు వారి రంగాలలో విశేష ఆదరణ చేసారు అని అభినందించారు. ఈ సందర్భంగా ఆర్థికంగా వెనుకబడిన వారికి చక్రాలు కుర్చీలు, సైకిలు చేతి కర్రలు, నగదు సహాయం అందజేశారు రచయిత డాక్టర్ శోభా పెరిందేవి డి హేమ లత, సంధ్యా శ్రీ శైలజ అరుణ పాల్గొన్నారు.

వైద్యసేవల బలోపేతానికి విధానాల రూపకల్పన

- అధికారులకు మంత్రి దామోదర ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసేవల బలోపేతానికి నిర్దిష్టమైన విధానాలను రూపొందించి అమలు చేయాలని అధికారులను వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశించారు. మంగళవారం హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షలో ప్రభుత్వ ఆస్పత్రుల బ్రాండింగ్‌పై ఆ శాఖ కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తూ పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా చేపట్టబోయే అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రుల పై నమ్మకం, పెరిగేలా మెరుగైన సేవలు అందించాలని కోరారు. ఆ లక్ష్యంతో ప్రభుత్వ ఆస్పత్రులను బ్రాండింగ్ చేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ సమీక్షా సమావేశంలో తెలంగాణ వైద్యసేవల మౌలిక సదుపాయాల సంస్థ (టిజిఎంఐడిసి) ఎండి ఫణీంద్ర రెడ్డి, రాష్ట్ర వైద్యవిద్య సంచాలకులు డాక్టర్ నరేంద్ర కుమార్, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, రాష్ట్ర వైద్యవిద్య సంచాలకుల పరిధిలో ప్రత్యేకాధికారి డాక్టర్ విమల థామస్, టిజిఎంఐడిసి సిఇ దేవేందర్‌లు పాల్గొన్నారు.

జర్నలిస్టు కుటుంబాలకు 9న ఆర్థిక సహాయం అందజేత

- మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇటీవలి కాలంలో చనిపోయిన, ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న జర్నలిస్టులకు చెందిన 38 కుటుంబాలకు వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుంచి లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని ఈ నెల 9న మీడియా అకాడమీ ఆడిటోరియంలో అందజేస్తామని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. ఆ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. మంగళవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల మరణించిన 38 మంది జర్నలిస్టుల కుటుంబాలకు లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఐదేళ్ల వరకు నెలకు రూ.మూడు వేలు పెన్షన్ ఎల్‌కేజీ నుంచి పదో తరగతి వరకు చదివే ఇద్దరు పిల్లలకు నెలకు రూ. రెండు వేలు చొప్పున ట్యూషన్ ఫీజు ఇవ్వనున్నట్టు తెలిపారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న, ప్రమాదానికి గురై భృతిని కోల్పోయిన జర్నలిస్టులు, ఇతర వ్యాధులకు గురైన వారికి లక్ష రూపాయల చొప్పున మొత్తం ఎనిమిది మందికి ఆర్థిక సాయం మంజూరు చేశామని వెల్లడించారు. ఆర్థిక సహాయం అందజేత అనంతరం మీడియా అకాడమీకి చెందిన https:// mediaacademy. telangana.gov.in వెబ్‌సైట్‌ను, జర్నలిస్టుల పునశ్చరణ తరగతుల నిర్వహణకు అకాడమీ ప్రచురించిన వివిధ అంశాలతో కూడిన చిరు పుస్తకాలను మంత్రి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరిస్తారని తెలిపారు.

మామిడి పండ్లపై కార్బైడ్

- మంత్రి తుమ్మల సీరియస్
- ఎఫ్ఎస్ఎస్ఐ, మార్కెటింగ్ శాఖ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మామిడి పండ్ల సీజన్‌లో కాయలపై కార్బైడ్ చల్లి మాగబెట్టడంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీరియస్ అయ్యారు. ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం మంత్రి ఆదేశాలమేరకు ఎఫ్ఎస్ఎస్ఐ, మార్కెటింగ్ శాఖ అధికారులు అకస్మిక తనిఖీలు నిర్వహించారు. కార్బైడ్ వంటి వాటిని మామిడి పంట్లపై ప్రయోగిస్తే ప్రజలకు ఆరోగ్యపరంగా ఇబ్బందులు తలెత్తుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయంలో నిబంధనలను ఉల్లంఘిస్తే ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా నిరంతర తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. ట్రేడర్లందరూ లైసెన్స్ పొంది, ప్రమాణాలు పాటించాలని మంత్రి సూచించారు. హానికరమైన రసాయనాలను వాడకుండా ఉండాలని కోరారు.

ప్రాంతాల వారీగా తనిఖీల వివరాలిలా

వరంగల్‌లో ఐదు చోట్ల, బాటసింగారం (గడ్డిఅన్నారం)లో ఏడు చోట్ల, జగిత్యాలలో 10 చోట్ల, హైదరాబాద్ (జాంబాగ్)లో పలు చోట్ల అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో కార్బైడ్ వంటివి వాడకపోయినా, పలు చోట్ల ఎథిలిన్ సాచెట్లను మోతాదుకు మించి వాడుతున్నట్టు గుర్తించారు. అలాగే ఎథిలిన్ సాచెట్లు నేరుగా పండ్లకు తగిలే విధంగా ఉంచడాన్ని గుర్తించి, అలాంటి పండ్లను సీజ్ చేసి ప్రివెంటివ్ మెడిసిన్ సంస్థకు పరీక్ష కోసం పంపించారు. ఆ సంస్థ రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకుంటారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు ప్రతివారం కొనసాగనున్నాయి. కేవలం మార్కెట్లలో మాత్రమే కాకుండా పండ్లను అమ్మే చోట్ల కూడా ఈ తనిఖీలు నిర్వహించనున్నారు.

కాడి కింద పడేసిన సిఎం

- ఆయన మాటలు తెలంగాణ భవిష్యత్తుకు శాపం
- ఒకవైపు దివాళా మాటలు- మరో వైపు తెలంగాణ రైజింగ్ గొప్పలు
- రేవంత్‌పై కెటిఆర్ ఫైర్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అధికారం కోసం ఎన్నికలకు ముందు అడ్డగోలుగా హామీలిచ్చిన రేవంత్ రెడ్డి సిఎం అయ్యాక కాడి కింద పడేశారని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఎద్దేవా చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ లో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి మాటలు తెలంగాణ భవిష్యత్తుగా శాపంగా మారుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీల అమలు కోసం అడిగితే సిఎం తప్పించుకు తిరుగుతున్నారని తెలిపారు. ఉద్యోగులను అవమానిస్తున్నారని తప్పుపట్టారు. ఒకవైపు దివాళా మాటలు మాట్లాడుతూ మరో వైపు తెలంగాణ రైజింగ్ అంటూ గొప్పలు చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు.

బిఆర్ఎస్ ను, మమ్మల్ని ఎన్ని తిట్టినా భరిస్తాం కానీ, రాష్ట్ర ప్రతిష్టను దెబ్బతినేలా మాట్లాడితే సహించేది లేదని హెచ్చరించారు. ఢిల్లీ పార్టీలను నమ్మొద్దని ఎన్నికల వేళ కేసీఆర్ చెప్పిన మాటలు ప్రస్తుతం అక్షరసత్యాలయ్యాయని తెలిపారు. రేవంత్ రెడ్డి అసమర్థ, దక్షత లేని ముఖ్యమంత్రి అని ఆయన సోమవారం చేసిన వ్యాఖ్యలతో తేలిపోయిందన్నారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో ఇచ్చిన అంశాలనే ఉద్యోగులు అడుగుతున్నారని తెలిపారు. రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇచ్చేందుకు కూడా డబ్బుల్లేవా? అని ఆయన ప్రశ్నించారు.

కెసిఆర్ సిఎంగా ఉన్న సమయంలో ఉన్న విద్యుత్, తాగునీరు ఇప్పుడెందుకు రావడం లేదని ప్రశ్నించారు. నెలకు రూ.2 వేల కోట్ల అప్పులు మాత్రమే చెల్లిస్తోందని స్పష్టం చేశారు. మరో పదేళ్లలో ఏడాదికి రూ.2.67 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. అప్పుల్లో తెలంగాణ 28వ స్థానంలో ఉందని పార్లమెంటులో కేంద్రమే చెప్పిందని గుర్తుచేశారు. గడిచిన పదేళ్లలో తలసరి ఆదాయంలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచిందని తెలిపారు. ఉమ్మడి ఎపి చివరి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి బిఆర్ఎస్‌కు రాష్ట్రాన్ని అప్పగించేనాటికి ఈ అంశంలో రాష్ట్రం 12వ స్థానంలో ఉందని చెప్పారు. రేవంత్ సర్కార్ వచ్చాక బంగారు తెలంగాణను అస్తవ్యస్తం చేశారని ఆరోపించారు.

సిఎం రేవంత్ రెడ్డి 17 నెలల పాలనపై శ్వేతపత్రం విడుదల చేయాలని కేటీఆర్ ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. హెలికాప్టర్ల కోసం మంత్రులు ఘర్షణ పడుతుంటే, ఉద్యోగులవి గొంతెమ్మ కోరికలంటూ సిఎం అక్కసు వెళ్లగక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పరిపాలన చేతగాక పోతే రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అలా కాదని తెలంగాణ రాష్ట్రాన్ని తిడతాం, కెసిఆర్‌ను దూషిస్తామంటే ఊరుకోబోమనీ, నాలుక చీరేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండలిలో బిఆర్ఎస్ పక్షనేత మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు కె.పి.వివేకానంద, వేముల ప్రశాంత్ రెడ్డి, గంగుల కమలాకర్, సునీతా లక్ష్మారెడ్డి, పల్లా రాజేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- 20న దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలంటూ.. మే 20న దేశ వ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో అన్నిరంగాల కార్మికవర్గం పాల్గొని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని తిరందాసు గోపి మీటింగ్ హాల్‌లో మంగళవారం జరిగిన సిఐటియు జిల్లా స్థాయి రాజకీయ శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం కార్మికుల హక్కులను కాలరాస్తోందని, గతంలో పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి.. 4లేబర్ కోడ్‌లను తీసుకొస్తోందని విమర్శించారు. వాటిల్లో కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు, సమ్మె హక్కు కాలరాయబడ్డాయన్నారు. 8గంటల పని విధానాన్ని 12గంటలకు పెంచి కార్మికులను శ్రమ దోపిడీకి గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను ధ్వంసం చేస్తూ.. కార్మికోద్యమం, కార్మిక ఐక్యతపై దాడి చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కులం, మతం, అస్తిత్వ భావజాలంతో కార్మికోద్యమం దెబ్బ తీయడానికి, రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తోందని వివరించారు. ఈ క్రమంలో కార్మిక ఐక్య పోరాటలను ఉధృతం చేయడంలో భాగంగా.. మే 20న దేశవ్యాప్త సమ్మెలో ప్రతి కార్మికుడూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షకార్యదర్శులు దాసరి పాండు, కల్లూరి మల్లేశం, జిల్లా ఉపాధ్యక్షులు ఎండి పాషా, గొరిగే సోములు, జిల్లా సహాయ కార్యదర్శి మాయ కృష్ణ, తుర్కపల్లి సురేందర్, సుబ్బూరి సత్యనారాయణ, గడ్డం ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- తెలంగాణ రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షాలు, వడగండ్ల వానల వల్ల తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. కొనుగోలు కేంద్రాల్లో టార్ఫాలిన్లు, గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలని కోరింది. కొనుగోళ్లను వేగంగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్‌రావు, టి సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ధాన్యం కొనుగోళు సకాలంలో పూర్తి కాకపోవడం వల్ల రైతులు రోజుల తరబడి ఆయా కేంద్రాల్లో వేచి ఉండాల్సి వస్తోందని తెలిపారు. రైతు ధాన్యం అమ్మిన తర్వాత కూడా మిల్లులకు చేరే వరకు కాపలా కాయాల్సి వస్తుందని పేర్కొన్నారు. క్వింటాలుకు రెండు నుంచి నాలుగు కిలోల దాకా తరుగు తీస్తున్నారని పేర్కొన్నారు. దాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ధాన్యం కొన్న వెంటనే రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేయాలని కోరారు. మొక్కజొన్న, వరి, మామిడి, కొబ్బరి, బొప్పాయి, కూరగాయలు, చెరుకు తదితర పంటలు కూడా బాగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. ఎకరాకు రూ.10వేల పంట నష్ట పరిహారమిస్తామన్న ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని కూడా ప్రారంభించలేదని గుర్తు చేశారు. యాసంగిలో దెబ్బతిన్న పంటల వివరాలకు సేకరించి, పూర్తి పరిహారాన్ని చెల్లించాలని వారు డిమాండ్ చేశారు.

గచ్చిబౌలిలో క్రౌన్‌వెట్ నూతన క్లినిక్ ప్రారంభం

ప్రజాశక్తి - హైదరాబాద్

ఆధునిక వెటర్నరీ క్లినిక్‌ల చైన్ అయిన క్రౌన్ వెట్ తాజాగా గచ్చిబౌలిలో తన నూతన క్లినిక్‌ను ప్రారంభించినట్లు ప్రకటించింది. పెంపుడు జంతువుల కుటుంబాలకు అధిక నాణ్యత, ప్రేమతో కూడిన పశువైద్య సంరక్షణను అందించాలనే తమ లక్ష్యంలో భాగంగా ఇది మరో అడుగు అని పేర్కొంది. జయభేరి ఎన్‌క్లేవ్‌లోని మాపుల్ సెలెస్టియాలో ఉన్న 1,400 చదరపు అడుగుల క్లినిక్ డిజిటల్ ఎక్స్-రే, అల్ట్రాసౌండ్, ఎనలైజర్‌లను ఉపయోగించి అంతర్గత పాథాలజీ, అధునాతన శస్త్రచికిత్స, రోగనిర్ధారణ సామర్థ్యాలతో సహా అత్యుత్తమ వైద్య మౌలిక సదుపాయాలు లభిస్తాయని క్రౌన్ వెట్ వ్యవస్థాపకులు ప్రతాప్ సిన్హ్ గౌక్వాడ్ తెలిపారు.

బిజెపి నేతల అవివేకానికి నిదర్శనం

- మంత్రి శ్రీధర్‌బాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని అధికారం నుంచి దిగిపోవాలంటూ బిజెపి నాయకులు మాట్లాడటం వారి అవివేకానికి నిదర్శనమని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. కేంద్రంలో బిజెపి నేతలను దిగిపోవాలంటూ డిమాండ్ చేయగలరా? అని ప్రశ్నించారు. పహల్గాం దుర్ఘటన నేపథ్యంలో ఎవరు దిగిపోవాలో చెప్పగలరా? అని నిలదీశారు. మంగళవారం హైదరాబాద్‌లోని సిఎల్‌పి కార్యాలయంలో ఆయన విలేకర్లతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీజేపీ ఇచ్చిన ఏ ఒక్క హామీనైనా నెరవేర్చిందా? సమాధానం చెప్పాలన్నారు. ప్రధాని మోడీ ఎన్నో దేశాల్లో పర్యటించారు, మరి లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయా? అని ప్రశ్నించారు. ఒకరిద్దరు బీజేపీ నేతలు ప్రభుత్వాన్ని బెదిరించినట్టు మాట్లాడారనీ, దానికి సీఎం రేవంత్ ప్రతి స్పందించారని తెలిపారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన లక్షల కోట్ల అప్పులు, వారు చేసిన తప్పుల గురించి ప్రజలకు తెలియజేందుకే రేవంత్‌రెడ్డి అలాంటి వ్యాఖ్యలు చేశారని చెప్పారు. ఇప్పుడు ప్రభుత్వానికి ఉన్న హెలికాప్టర్‌ను బీఆర్ఎస్ ప్రభుత్వమే అద్దెకు తీసుకుందని గుర్తు చేశారు. మంత్రులు జిల్లాల్లో పర్యటిస్తే కార్ల తిరగడం వల్ల అయ్యే ఖర్చు కంటే హెలికాప్టర్‌లో తిరిగితే ఖర్చు తక్కువగా ఉందని చెప్పారు. బిఆర్ఎస్ ప్రభుత్వంలో మంత్రులు హెలికాప్టర్‌లో తిరగకుండానే అద్దె చెల్లించారని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమం కోసం సిఎం ఆలోచించి మాట్లాడారని తెలిపారు. ఆర్థిక వ్యవస్థను గత పాలకులు చిన్నా, భిన్నం చేశారని విమర్శించారు. ఆ పరిస్థితులను చూసిన రేవంత్ ఆవేదనతో ఆ వ్యాఖ్యలు చేశారని తెలిపారు. ఉద్యోగులతో బిఆర్ఎస్ పార్టీకి పేగుబంధం ఉంటే, ఆనాడు టైమ్‌కు జీతాలు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ అధికారంలోకి రాగానే డీఏ ఇచ్చాం. వాళ్లలాగా మేం వదిలేయలేదు. కార్పొరేషన్ పేరుతో తెచ్చిన అప్పులు కూడా ప్రభుత్వమే కడుతుంది. గత ప్రభుత్వం చేసిన అప్పుల గురించే మాట్లాడుతున్నారు. వాళ్లు చేసిన తప్పుల గురించి మాట్లాడటం లేదు' అని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని దివాళా తీయించింది కెసిఆర్ కాదా? అని ప్రశ్నించారు. దాని నుంచి బయట పడేసే పనిలో తామున్నామని స్పష్టం చేశారు. 'సెక్రటేరియట్ సిఎంకు ఇల్లు అయితే...వాళ్లు ఉండేది ఫామ్ హౌసా? అని ఎద్దేవా చేశారు. తెలంగాణ రాష్ట్రంలోనే కాదు...దేశ వ్యాప్తంగా ఆర్థిక పరిస్థితి ఇబ్బందికరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. అయినప్పటికీ తమ ప్రభుత్వం వనరులను పెంచడం ద్వారా నిధులు తెచ్చుకునే పనిలో ఉందని తెలిపారు. మావోయిస్టులతో తమ కుటుంబానికి అన్యాయం జరిగిందని గుర్తు చేశారు. కానీ ఇంకో కుటుంబానికి అన్యాయం జరగొద్దనేది తమ ఆలోచన అని వ్యాఖ్యానించారు. వారు శాంతి చర్చలు కోరడం తప్పు కాదని, గతంలో కాంగ్రెస్ ప్రభుత్వమే మావోయిస్టులతో చర్చలు జరిపారని ఆయన గుర్తు చేశారు.

బోర్లు వేసి అప్పులపాలై.. యువరైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



రవీందర్ (ఫైల్ ఫోటో)

పంటలు బాగా పండుతాయన్న ఆశతో అప్పులు చేసి రెండు బోర్లు వేసినా అనుకున్న స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో ఓ యువ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపల్ పరిధిలోని దుంపలపల్లి 4వ వార్డులో మంగళవారం జరిగింది. పోలీసులు, మృతుని కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. 4 వార్డులో నివాసం ఉంటున్న రవీందర్ (36) తనకున్న ఎకరంన్నర భూమితో పాటు కొంత కౌలుకు తీసుకుని వ్యవసాయం చేసేవారు. అయితే నీటి సౌకర్యం లేకపోవడంతో తమ పొలంలో రెండు బోర్లు వేశారు. వాటి కోసం అప్పు చేశారు. అలాగే కుటుంబ పోషణకు కూడా కలిపి మొత్తంగా రూ. నాలుగు లక్షల వరకు అప్పు చేయాల్సి వచ్చింది. అయితే అనుకున్న స్థాయిలో పంట దిగుబడి రాకపోవడంతో అప్పు ఎలా తీర్చాలని తీవ్రంగా మనస్తాపానికి గురయ్యాడు.

ఈ క్రమంలో రవీందర్ భార్య రమ్యకృష్ణ తన సోదరునికి కూతురు పుట్టిందని.. చూసి వస్తానని ఈ నెల 3న వెళ్లింది. అలాగే పిల్లలను తీసుకుని రవీందర్ తల్లి విజయ కొండపాకలోని బంధువుల ఇంటికి ఈ నెల 5న వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉన్న రవీందర్‌రెడ్డి చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. ఈ మేరకు మృతుని భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

తేనెటీగల దాడి.. ఒకరు మృతి

- ముగ్గురికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలం గోలేటి వన్ ఇంక్లైన్ వద్ద తేనె టీగలు దాడి చేయడంతో తీవ్రంగా గాయపడి ఒకరు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోలేటి వన్ ఇంక్లైన్‌కు సంబంధించి ప్రహరీ నిర్మిస్తున్నారు. ఆ సమయంలో అక్కడ పనిచేస్తున్న కార్మికులు నలుగురిపై అకస్మాత్తుగా తేనె టీగలు దాడి చేశాయి. గాయపడిన నరసయ్య, వాసు, శ్రీనివాస్, పైడిధర్‌ను సింగరేణి డిస్పెన్సరీకి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నర్సయ్య(45)ను బెల్లంపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. నరసయ్యకు భార్య, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎఐటియుసి, ఐఎన్‌టియుసి నాయకులు కోరారు.

లఘు చిత్రాల ఉత్తమ దర్శకునిగా రామడుగు వసంత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లఘుచిత్రాల ఉత్తమ దర్శకుడుగా నగరానికి చెందిన కళాకారుడు రామడుగు వసంత్ ఎంపికయ్యారు. దర్శక రత్న దాసరి నారాయణరావు జన్మ దినోత్సవ వేడుకల్లో భాగంగా రవీంద్రభారతిలో టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్స్ అసోసియేషన్, రెయిన్ బో చిల్డ్రన్స్ ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో ఈ పోటీలు, ప్రదర్శనలు జరిగాయి. విభిన్న రీతిలో నిర్మించిన టెన్ టైమ్స్ అనే లఘు చిత్రానికి దర్శకత్వం వహించిన రామడుగు వసంత్ ఉత్తమ దర్శకుడుగా ఎంపికయ్యారు. ప్రముఖ సినీ దర్శకుడు వి.సముద్ర, అసోసియేషన్ అధ్యక్షుడు కె.మోహన్ ఈ అవార్డు ను అందజేసి సత్కరించారు. దీంతో పాటు టెన్ టైమ్స్ నిర్మాత పద్మావతి విజయలక్ష్మికి కూడా అవార్డ్ బహుకరించారు. ఇందులో నటించిన చిత్ర బ ందాన్ని వి.సముద్ర, కె.మోహన్ ప్రత్యేకంగా అభినందించారు. ఉత్తమ దర్శకుడు వసంత్ కు నటనలో, ఇంద్రజాలంలో, రచనలు లోకూడా అనుభవం ఉంది. గతంలో పలు షార్ట్ ఫిలింలకు దర్శకత్వం వహించి ప్రశంసలు పొందారు.

ప్రభుత్వానిది శ్రమదోపిడీ..

- ఉపాధి కార్మికులకు రూ.40 వేతనం ఏమిటి?
- వేసవి అలవెన్స్ పునరుద్ధరించాలి
- పెండింగ్ బిల్లులు, ఉద్యోగులకు వేతనాలివ్వాలి : జాన్‌వెస్లీ
- మంచాల మండలం ఎల్లమ్మతాండలో సిపిఎం బృందం పర్యటన
- కనీస వసతులు లేవంటూ తమ ఆవేదనను చెప్పుకున్న కార్మికులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి కార్మికులను ప్రభుత్వాలు శ్రమ దోపిడీ చేస్తున్నాయని, పొద్దంతా పని చేయించి రూ.40 ఇవ్వడం ఏమిటనీ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం రూ.307 చెల్లించాల్సి ఉందని, కొలతల విధానంతో ప్రభుత్వాలు ఉపాధి కార్మికులను మోసం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం మంచాల మండలంలోని ఎల్లమ్మతాండలో జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో సిపిఎం బృందం పర్యటించి ఉపాధి హామీ పనులను పరిశీలించారు. పని జరుగుతున్న తీరును తెలుసుకుని, సమస్యలపై ఆరా తీశారు. కార్మికులతో జాన్‌వెస్లీ ముఖాముఖి నిర్వహించారు.. 'దినసరి కూలీ ప్రభుత్వ నిబంధనాల ప్రకారం రూ. 307 వస్తున్నాయా అని కూలీలను అడగ్గా.. రోజుకు కేవలం రూ.40 మాత్రమే వస్తున్నాయని వేతనదారుడు చెప్పారు. 'ఇంత ఎండలో పనిచేస్తున్నారు.. కనీసం నిలబడటానికి నీడ కూడా లేదు.. ప్రభుత్వం మీకు ఇచ్చిన టెంటు ఎక్కడ పోయింది' అని అడగ్గా.. ఇప్పటి వరకు తమకు టెంటు లేదు సారూ.. కనీసం తాగడానికి నీరు కూడా లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటి నుంచి తెచ్చుకుంటున్న బాటిల్స్ నీటితోనే గొంతు తడుపుకుంటున్నామని చెప్పారు. 'గట్టి నేలలు తవ్వితే పెళ్లకూడా బయటికి వస్తలేదని.. కొలతల ప్రకారం కూలి అంటే గీ గుట్టల్లో ఎట్లా అవుతుంది' అంటూ తమ గోడును సిపిఎం బృదం ఎదుట వారు వెల్లబోసుకున్నారు. దీనికి సిపిఎం నాయకులు స్పందిస్తూ.. మీకు అండగా ఉంటామన్నారు. వారి సమస్యలు పరిష్కారం అయ్యే వరకూ ప్రభుత్వాలతో పోరాడుతామని భరోసానిచ్చారు.



ఉపాధి కార్మికులతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

అనంతరం జాన్‌వెస్లీ మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వ కొలతలతో సంబంధం లేకుండా కార్మికులకు వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొలతలే ప్రామాణికం అనుకుంటే వేసవి కాలంలో గట్టినేలల్లో గుంతలు కొట్టుడు, కట్టలు పోసుడు పనులకు ప్రత్యామ్నాయం చూపాలన్నారు. కార్మికులకు కచ్చితంగా ఉపాధి చట్టం ప్రకారం దినసరి కూలి రూ.307 ఇవ్వాల్సిందేనని స్పష్టం చేశారు. వేసవి అలవెన్స్‌లు నిలిపివేయడం సరైంది కాదని, తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని నీరుగార్చే కుట్రలు చేస్తోందన్నారు. దీనికి నిదర్శనమే ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.86 లక్షల కోట్లతో సరి పెట్టిందన్నారు. రాష్ట్రంలో 'ఉపాధి' ఉద్యోగులకు పెండింగ్ వేతనాలను సకాలంలో చెల్లించాలని డిమాండ్ చేశారు. సుమారు 3,200 మంది ఉద్యోగులకు వేతనాలు అందక సతమతం అవుతున్నారన్నారు. కార్మికులకు వారాల కొద్దిగా వేతనాలు పెండింగ్‌లో ఉండటంతో ఆ కుటుంబాల జీవనం కష్టతరంగా మారుతోందన్నారు. ప్రభుత్వం ఉపాధి కార్మికులకు ప్రస్తుతం పెరిగిన ధరలకు అనుగుణంగా దినసరి వేతనం రూ.600 ఇవ్వాలని, ఏడాదికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య మాట్లాడుతూ.. కూలీల సమస్యలపై ఈ నెల 30న చేపట్టనున్న చలో కలెక్టరేట్ కార్యక్రమంలో ఉపాధి కార్మికులు పెద్దసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ పర్యటనలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామెల్, డి.జగదీష్, ఇ.నర్సింహ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.అంజయ్య, కందుకూరి జగన్, పార్టీ మంచాల మండల కార్యదర్శి రావుల జంగయ్య, జిల్లా కమిటీ సభ్యులు కర్నాటి శ్రీనివాస్‌రెడ్డి, నాగిల్ల శ్యామ్ సుందర్, పి జగన్ తదితరులు పాల్గొన్నారు.

మెట్రో ఛార్జీలు పెంచొద్దు

- ఫేర్ ఫిక్సేషన్ కమిటీ నివేదిక బయట పెట్టాలి : సిపిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మెట్రో రైల్ చార్జీలను 30శాతం పెంచాలన్న ప్రతిపాదనలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఆ ప్రతిపాదనలను వెంటనే ఉపసంహరించుకోవాలని సిపిఎం గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళవారం ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఫేర్ ఫిక్సేషన్ కమిటీ నివేదిక మేరకే ఈ పెంపుదల ఉంటుందని ఎల్అండ్‌టి సంస్థ చెబుతున్నదని, ఆ కమిటీ ఇచ్చిన నివేదికను ప్రజల ముందుంచాలని రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం తరపున విజ్ఞప్తి చేశారు. ప్రజలకు నాణ్యమైన, మెరుగైన చౌక రవాణా సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే పేర్కొన్నారు. ఎల్అండ్‌టీ ఆధ్వర్యంలో నడుస్తున్న మెట్రో రైల్‌కు నష్టాలు వస్తున్నాయన్న కారణంతో టికెట్ ధరలు పెంచితే ఆక్యుపెన్సీ రేట్ తగ్గే ప్రమాదం ఉందన్నారు. ఎల్అండ్‌టీకి వస్తున్న నష్టాలకు ఆ సంస్థనే బాధ్యత వహించాలని పేర్కొన్నారు.

ప్రభుత్వంతో కుదుర్చుకున్న అగ్రిమెంట్‌లో టికెట్ల ద్వారా 50శాతం, రియల్ ఎస్టేట్ ద్వారా 45శాతం, ప్రకటనల ద్వారా 5శాతం ఆదాయాన్ని సమకూర్చుకోవాలని స్పష్టంగా రాసుకున్నారని, ఎల్అండ్‌టీ సంస్థ ఇతర పద్ధతులపై దృష్టి పెట్టకుండా టికెట్ల ధరలు పెంపుదలపై దృష్టి పెట్టడం సమంజసం కాదన్నారు. ఎల్అండ్‌టీ సంస్థ మెట్రో ట్రైన్‌లకు బోగీలు పెంచడం ద్వారా ఆక్యుపెన్సీని పెంచుకొని ఆదాయాన్ని సమకూర్చుకునే అవకాశం ఉందని, ఇప్పటికే పార్కింగ్ ఫీజులూ వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. అందువల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు నష్టం చేసే మెట్రో చార్జీల పెంపుదలను వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు.



సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీకి షారుఖ్ కొత్త ప్రచారం

హైదరాబాద్: ప్రముఖ ఎఫ్ఎంసిజి కంపెనీ ఐటిసికి చెందిన సన్‌ఫీస్ట్ డార్క్ ఫాంటసీకి బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్‌తో సరికొత్త ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆ సంస్థ తెలిపింది. దీనిలో అత్యంత కీలకంగా ఒక ఉత్తేజకరమైన హిందీ కవిత ఉందని ఐటిసి లిమిటెడ్ ఫుడ్స్ డివిజన్ బిస్కెట్స్ అండ్ కేక్స్ క్లస్టర్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అలీ హారిస్ షేర్ పేర్కొన్నారు.

రైల్వేల ప్రయివేటీకరణ చర్యలను ఆపాలి

- ప్రయాణికుల భద్రతకు రక్షణ చర్యలు తీసుకోవాలి
- సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె వెంకటేష్
- నాంపల్లి రేల్వే స్టేషన్ వద్ద ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైల్వేల ప్రయివేటీకరణను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వెంటనే ఆపాలని, ప్రయాణికుల రక్షణ, ప్రమాదాల నివారణకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జె.వెంకటేష్ డిమాండ్ చేశారు. ఉద్యోగులకు రక్షణ కల్పించాలన్నారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన భారతీయ రైల్వేలను అదానీ, అంబానీ వంటి స్వదేశీ, విదేశీ ప్రయివేట్ కార్పొరేట్లకు కట్టబెట్టొద్దని, ప్రయాణికుల భద్రతకు తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిజెపి ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తరువాత నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్ విధానంలో భాగంగా భారతీయ రైల్వేలను స్వదేశీ, విదేశీ కార్పొరేట్ శక్తులకు అప్పనంగా కట్టబెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైల్వేల ప్రయివేటీకరణ వల్ల సామాన్య ప్రజానీకం అతిచవకైన రవాణా సౌకర్యం కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇప్పటికే రైల్వే యాజమాన్యం ప్యాసింజర్ రైళ్లను తగ్గించిందని, ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను తగ్గించిందని వివరించారు. వందే భారత్ ట్రైన్‌లను ప్రవేశపెట్టి టికెట్ల ధరలు అధికంగా పెంచి సామాన్య, మధ్యతరగతి ప్రజలకు వాటిని దూరం చేసిందన్నారు. రైల్వేలలో ప్రయాణికుల రక్షణకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదని విమర్శించారు.

ఈ మధ్యకాలంలో అనేక ప్రమాదాలు జరిగి ప్రయాణికులు ప్రాణం కోల్పోయారని, ఉద్యోగస్తులూ ప్రాణం కోల్పోయారని తెలిపారు. రైల్వేలలో రక్షణ కోసం అధునాతనమైన టెక్నాలజీ రక్షక్, కవచ్ వంటివి వాడతామని ప్రభుత్వం చాలాసార్లు చెప్పినా వాటికి నిధులు కేటాయించడంలో నిర్లక్ష్యం వహిస్తోందన్నారు.

రైల్వేలో దేశవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని తెలిపారు. వారికి చట్టపరమైన హక్కులు కల్పించకుండా రైల్వే యాజమాన్యం, కాంట్రాక్టర్లు వెట్టి చాకిరీ చేయించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస వేతనాలు చెల్లించడంలో ఈఎస్ఐ, పీఎఫ్, బోనస్, పే స్లిప్పులు ఇవ్వడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారన్నారు. హైదరాబాద్ రైల్వేస్టేషన్‌లో గతంలో 150 మంది పనిచేయగా, నేడు కేవలం 27 మందితో పని చేయించుకుంటూ పని భారం పెంచారన్నారు. వెంటనే రైల్వేల ప్రయివేటీకరణ ఆపాలని, ఉద్యోగులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు చట్టపరమైన హక్కులు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో రైల్వేల రక్షణ కోసం పెద్దఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు ఈనెల 20న జరుగుతున్న దేశవ్యాప్త సమ్మెలో రైల్వే ఉద్యోగులు, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేష్, రైల్వే సీనియర్ నాయకులు శివకుమార్, ఎల్లయ్య, సిఐటియు నాంపల్లి జోన్ కన్వీనర్ సి మల్లేష్, నాయకులు హర్షద్ అహ్మద్, ఎం యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వేతన ఒప్పందానికి సిఐటియునే గెలిపించండి

- రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు
- రాణే బ్రేక్ లైనింగ్ పరిశ్రమ గేట్ మీటింగ్‌కు హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాణే బ్రేక్ లైనింగ్ లిమిటెడ్ పరిశ్రమలో నేడు జరగనున్న కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో సిఐటియును భారీ మెజార్టీతో గెలిపించాలని.. మెరుగైన వేతన ఒప్పందం సిఐటియుతోనే సాధ్యమని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు, ఉపాధ్యక్షులు మల్లికార్జున్ తెలిపారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ మండలంలోని రాణే పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో భాగంగా పరిశ్రమ గేట్ మీటింగ్‌ను యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సిఐటియు.. కార్మికుల మెరుగైన జీవన ప్రమాణాల కోసం యజమాన్యలతో రాజీలేని పోరాటాలు నిర్వహిస్తున్నదన్నారు. ఈ క్రమంలో జాతీయ, రాష్ట్ర కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న సమ్మె చేస్తుంటే బిఎంఎస్ మాత్రం కేంద్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతున్నదన్నారు. పరిశ్రమ భద్రత, ఉద్యోగ భద్రతా ప్రమాణాలు, సంక్షేమ పథకాలను నూతన కోడ్‌లలో నిర్వీర్యం చేసిందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో విభజించే కార్మికుల ఐక్యతను విచ్ఛినం చేసే బిఎంఎస్‌ను ఓడించాలని సిఐటియును భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం సిద్దిపేట జిల్లా అధ్యక్షులు సందబోయిన ఎల్లయ్య, యూనియన్ ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, ఉప ప్రధాన కార్యదర్శి బండ్ల స్వామి, వర్కింగ్ ప్రెసిడెంట్ దువ్వల బిక్షపతి, యూనియన్ నాయకులు చంద్రశేఖర్ రెడ్డి, రవికుమార్, మల్లయ్య, నర్సింలు, రంగారెడ్డి, వివెంకట్రావు కార్మికులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించిన రైతులు, రైతు సంఘం నాయకులు

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

- మాక్లూర్‌లో రైతుల రాస్తారోకో
- మద్దతు తెలిపిన రాష్ట్ర రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుటనున్న ప్రధాన రహదారిపై రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు. రైతులకు మద్దతుగా తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పల్లపు వెంకటేష్, నాయకులు రాస్తారోకోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ.. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం మ్యాచర్ వచ్చినప్పటికీ కొనుగోళ్లు వేగవంతం చేయడం లేదని, దాంతో రైతులు అనేక అవస్థలు పడుతున్నారని అన్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. సోమవారం రాత్రి కురిసిన వర్షానికి కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయిందని, రైతులు తీవ్రంగా నష్టపోయారని అన్నారు. వెంటనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. లారీల సమస్య ఉండటంతో తూకం వేసిన ధాన్యాన్ని తరలించడంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, జిల్లా కలెక్టర్ బాధ్యత తీసుకుని కొనుగోళ్లు వేగవంతం చేయాలని కోరారు. రాస్తారోకోతో ఇరువైపుల వాహనాలు పెద్దఎత్తున నిలిచిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించేందుకు అటుగా వచ్చిన అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ రాస్తారోకో చేస్తున్న రైతులతో మాట్లాడి.. వారం రోజుల్లో ధాన్యాన్ని తరలిస్తామని హామీనిచ్చారు. దాంతో రైతులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మాక్లూర్ మండల కార్యదర్శి కొండ గంగాధర్, రైతులు రవి, భాజన్న, సాయిలు, రాజు, శేఖర్, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

ఐపిఎల్ బెట్టింగ్..

- నలుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- రూ.76,400 నగదు స్వాధీనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలోని చెరువుకట్ట సమీపంలో ఐపిఎల్ బెట్టింగ్ చేస్తున్న నలుగురు వ్యక్తులను సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.76,400 నగదును స్వాధీనం చేసుకున్నారు. చేర్యాల సిఐ ఎల్.శ్రీను తెలిసిన వివరాల ప్రకారం.. పట్టణ కేంద్రంలోని చెరువుకట్ట సమీపంలో ఐపిఎల్ బెట్టింగ్ ఆడుతున్నారని నమ్మదగిన సమాచారం రావడంతో సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చేర్యాల పోలీసులు దాడి చేశారు. దాంతో చేర్యాల పట్టణ కేంద్రానికి చెందిన శ్రీనివాస్, నర్ర చంద్రబాబు, ఎల్ల నవీన్ కుమార్, అక్కన్నపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కూరపాటి శివప్రసాద్.. ఐపిఎల్ బెట్టింగ్ ఆడుతూ పట్టుబడ్డారు. మరికొంతమంది పారిపోయారు. అదుపులోకి తీసుకున్న వారి వద్ద నుంచి రూ. 76,400 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, మూడు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పారిపోయిన నిందితులను త్వరలో పట్టుకుంటామని సీఐ తెలిపారు. పేకాట, గంజాయి, ఇతర మత్తు పదార్థాలు, బెట్టింగ్ వంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతున్నారని గుర్తిస్తే డయల్ 100 లేదా చేర్యాల పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంటాయన్నారు. చేర్యాల ప్రొబిషనరీ ఎస్ఐ సమత, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై హైడ్రా కొరడా

- గచ్చిబౌలి సంధ్యా కన్వెన్షన్ నిర్మాణాలు నేల మట్టం
- మైలార్‌దేవ్‌పల్లిలోనూ కొనసాగిన కూల్చివేతలు
- భారీ పోలీస్ బందోబస్తు మధ్య కట్టడాల కూల్చివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అక్రమ కట్టడాలపై హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. అక్రమ కట్టడాలను పూర్తిగా నేలమట్టం చేస్తోంది. తాజాగా మంగళవారం రంగారెడ్డి జిల్లా గచ్చిబౌలి, మైలార్‌దేవ్‌పల్లి ప్రాంతాల్లో హైడ్రా అధికారులు అక్రమ కట్టడాలను కూల్చి వేయించారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ కూల్చివేతలు చేపట్టారు. హైడ్రా అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గచ్చిబౌలిలోని సంధ్యా కన్వెన్షన్ నిర్మాణంపై మొదటి నుంచి కూడా వివాదం కొనసాగుతోంది. గచ్చిబౌలిలోని సర్వే నెంబర్ 124, 127లో ఫర్టిలైజర్ కార్పొరేషన్ సొసైటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ పేరుతో సుమారు 20 ఎకరాల్లో ప్లాట్లు చేసి అమ్మగా.. వాటిలో 162 మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. సంధ్యా కన్వెన్షన్ అక్రమంగా వీరి ప్లాట్‌లను కబ్జా చేసి రోడ్లు వేసి, భారీ నిర్మాణాలు చేపట్టింది. ఫుడ్ కోర్టులు, మినీ హాల్, భారీ షెడ్‌లు నిర్మించింది. మూడు అంతస్థుల నిర్మాణాలు చేపట్టారు. సొసైటీ స్థలంతో పాటు పక్కనున్న స్థలం కూడా కబ్జా చేశారని గత బిఆర్ఎస్ ప్రభుత్వంలోనే ఒకసారి కూల్చివేశారు. అయినా ఈ కబ్జా పర్వం కొనసాగింది. వీటిపై సొసైటీ వారు హైడ్రాకు ఫిర్యాదు చేశారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించి మంగళవారం ఉదయం నుంచి పెద్ద, పెద్ద మూడు హిటాచ్‌లతో కూల్చివేతలు చేపట్టారు. ఉదయమే నుంచే భారీ పోలీస్ బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాలను నేలమట్టం చేశారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లోని ఇందిరాగాంధీ సొసైటీలో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. గతంలో ఇందిరాగాంధీ సొసైటీలో రోడ్డును ఆక్రమించి ఒక వ్యక్తి భారీ షెడ్ల నిర్మాణం చేపట్టాడు. ఇటీవల సొసైటీ సభ్యులు ఈ విషయం హైడ్రా కమిషనర్ రంగనాథ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే రంగంలోకి దిగిన హైడ్రా అధికారులు ఆ షెడ్లను తొలగించాలని యజమానికి నోటీసులు అందజేశారు. అయినా యజమాని తొలగించకపోవడంతో మంగళవారం భారీ పోలీసు బందోబస్తు మధ్య ఉదయం కూల్చివేతలు ప్రారంభించారు. ఈ సందర్భంగా యజమాని హైడ్రాధికారులతో ఘర్షణకు దిగారు. అక్కడే ఉన్న పోలీసులు యజమానిని అక్కడి నుంచి పంపించారు. పూర్తిగా రోడ్డుపై నిర్మించిన షెడ్లను కూల్చివేశారు. అలాగే, గగన్‌పహాడ్‌లోనూ అనుమతులు లేకుండా నిర్మించిన పలు షెడ్లను అధికారులు కూల్చివేయించారు.

కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలి

- పెండింగ్ బకాయిలను విడుదల చేయాలి
- ప్రజా భవన్‌లో పంచాయతీ, మున్సిపల్ కార్మికుల వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గ్రామపంచాయతీ, మున్సిపల్ కార్మికులకు జీవో నెంబర్ 60 ప్రకారం కేటగిరీల వారీగా వేతనాలు చెల్లించాలనీ, మూడు నెలల బకాయిలను విడుదల చేయడంతో పాటు పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్ల (సిఐటియు అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు జనగాం రాజమల్లు, చాగంటి వెంకటయ్య, రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో నోడల్ అధికారి దివ్యకు వినతిపత్రాన్ని అందజేశారు. నోడల్ అధికారికి సమస్యలను వివరించారు. వివిధ మున్సిపాల్టీల్లో మూడు, నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదనీ, వేతనాల సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరినప్పటికీ వేతనాలకు సంబంధించిన చెక్కులను ట్రెజరీలలో వేశామని తప్పించుకుంటున్నారని ఆమె దృష్టికి తీసుకెళ్లారు. సిఎం ప్రకటించినట్టుగా పంచాయతీ కార్మికులకు గ్రీన్‌చానల్ ద్వారా వేతనాల చెల్లింపు ప్రక్రియ ప్రారంభించాలనీ, మల్టీపర్పస్ వర్కర్ విధానం రద్దు చేసి ప్రమాదాల్లో మరణించిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. పది లక్షల నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఆన్‌లైన్‌లో ఎక్కించకుండా మిగిలిపోయిన కార్మికుల పేర్లను నమోదు చేయాలని విన్నవించారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. తాము లేవనెత్తిన అంశాలను సిఎం దృష్టికి తీసుకెళ్లాలని విన్నవించారు. పంచాయితీ కార్మికులు చేయబోతున్న నిరవధిక సమ్మెను నివారించడానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీ కార్మిక సంఘాలతో చర్చలు జరపాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ రాష్ట్ర నాయకులు ఆకుల వెంకటేష్, వెంకటస్వామి, గుర్రం అశోక్, శ్రీనివాస్, గ్రామ పంచాయతీ యూనియన్ రాష్ట్ర నాయకులు రాపర్తి రాజు, నారోజు రాంచందర్, రాంచందర్, వెంకటేష్ గౌడ్, ఎండి కాజా, ఆసిఫ్ తదితరులతో పాటు పలు ప్రమాదాలలో మరణించిన వారి కుటుంబాల వారు పెద్దఎత్తున తరలొచ్చారు.



రైల్వేలో ప్రయివేటీకరణ చర్యలను ఉపసంహరించుకోవాలి

- నేడు, రేపు రైల్వే స్టేషన్ల వద్ద సిఐటియు ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైల్వే రంగంలో ప్రయివేటీకరణ చర్యలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిఐటియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చుక్కారాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిమాండ్‌పై సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా హైదరాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, మేడ్చల్, నల్గొండ, ఖమ్మం, కొత్తగూడెం, భూపాలపల్లి, హనుమకొండ, వరంగల్, నిజామాబాద్, మంచిర్యాల జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు జరిగాయని తెలిపారు. వీటికి కొనసాగింపుగా బుధ, గురువారాల్లో రైల్వే స్టేషన్ల వద్ద ధర్నాలు జరపనున్నట్టు తెలిపారు. కోట్లాది ప్రజానీకానికి అతి పెద్ద ప్రజా రవాణాగా ఉన్న రైల్వే రంగాన్ని కాపాడుకునేందుకు వీలుగా ప్రజలంతా ఈ ధర్నాల్లో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. దేశంలో ఇటీవల కాలంలో వరసగా రైల్వే ప్రమాదాలు సంభవిస్తున్నాయని గుర్తు చేశారు. లోకో పైలెట్లు, రైల్వే మేనేజర్లు, ట్రాక్ మెయింటెనర్లు, రైల్వే ఉద్యోగుల్లో నియమించిన వివిధ విభాగాల కాంట్రాక్ట్ కార్మికులు, వందలాది ప్రయాణీకులు ప్రమాదాల్లో మరణిస్తున్నా కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వే ప్రమాదాల్లో ఎక్కువమంది పేద, వలస కార్మికులే ఉంటున్నారని తెలిపారు.అయినా అంబానీ, అదానీలకు రైల్వే రంగాన్ని కారుచౌకగా కట్టబెట్టేందుకు మోడీ సర్కార్ చూస్తోందని విమర్శించారు. రైల్వే ప్రయాణీకుల భద్రతను పటిష్టపర్చాలనీ, ఉద్యోగులకు సురక్షితమైన పని పరిస్థితులు కల్పించాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ప్రయివేటీకరణను అడ్డుకోవాలనీ, రైల్వే విస్తరణ, భద్రత కోసం అవసరమైన నిధులను కేటాయించి, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరారు.